ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
బుధవారం 14 ఫిబ్రవరి 2024

చరిత్రకు...వందనం



సోంపాళ్యంలోని చెన్నకేశస్వామి ఆలయం

- సోంపాళ్యం...శిల్ప సోయగాల హారం
- పురాతన ఆలయాలకు నిలయం
- నేటికి చెక్కుచెదరని శిల్పసంపద
- సందర్శకులను ఆకట్టుకుంటున్న వైనం



జయ స్తంభం

ములకలచెరువు, ఫిబ్రవరి 13: ఈ గ్రామం చరిత్ర కలిగిన ఊరుగా.. పురాతన ఆలయాలకు నిలయంగా.. శిల్ప సోయగాల హారంగా ప్రఖ్యాతి గాంచింది. ఇక్కడ విజయనగర, చోళ రాజులు పలు ఆలయాలను నిర్మించారు. 11, 16వ శతాబ్దాల నాటి ఈ ఆలయాలు నేటికి పదిలంగా ఉండటం విశేషం. పురాతన చెన్నకేశవస్వామి, శ్రీమత్కోట చౌడేశ్వరి దేవి, నందీశ్వరుడు, మల్లికార్జునస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు విజయనగర రాజులు తమ విజయానికి ప్రతీకగా జయస్తంభం ఏర్పాటు చేశారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆ ఆలయాలను సందర్శించాలంటే... ములకలచెరువు మండలం కోనేటివారిపల్లె పంచాయతీలోని సోంపాళ్యం వెళ్లాల్సిందే.

- 11వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించిన శ్రీమత్కోట చౌడేశ్వరిదేవి ఆలయం ఉంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని తమిళనాడు రాష్ట్రం తంజావూరు కేంద్రంగా రాజేంద్ర చోళ చక్రవర్తి పాలించారు. రాజేంద్ర చోళ చక్రవర్తి పశ్చిమ చోళుక్యులపై యుద్ధం చేసి విజయం సాధించారు. ఇందుకు గుర్తుగా ఇక్కడ శ్రీమత్కోట చౌడేశ్వరిదేవి ఆలయాన్ని నిర్మించారు. చోళ చక్రవర్తి ఆరాదించే అమ్మవారిని ప్రతిష్టించారు. యుద్ధ దేవతగా అమ్మవారు సప్త గ్రామాల ప్రజల పూజలందుకుంటున్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వస్తూ పూజలు నిర్వహిస్తున్నారు.
- 16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. ఆలయంలో అడుగుపెట్టినప్పటి నుంచి అద్భుతమైన శిల్ప సంపద సందర్శకులను కళ్లు తిప్పుకోకుండా చేస్తాయి. ఆలయం లోపల ఏకశిలలో చెక్కిన రాతి రథం, రాతి కల్యాణమండపం ఉన్నాయి. అలాగే గోళ్ల మండపం, ఊంజల్ మండపాలు చూడవచ్చు. ఆలయం ఎదుట 60 అడుగుల ఏకశిలా ధ్వజ స్తంభం ఉంది. ఈ ధ్వజస్తంభం దేశంలోనే పెద్దదైన వాటిలో రెండవ స్థానంలో నిలిచింది. ఈ ఆలయం పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది.
- విజయనగర, చోళ రాజులు నిర్మించిన నందీశ్వరుడు, మల్లికార్జునస్వామి, మూడు ఆంజనేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. కోటమ్మ కొండపై ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయాలు ఎంతో ప్రాముఖ్యతను సంచరించుకున్నాయి.



ఆలయం ఎదుట ఉన్న 60 అడుగుల ఏకశిలా ధ్వజ స్తంభం

- ఇక్కడున్న జయస్తంభం చారిత్రక చిహ్నం. శౌర్యానికి గుర్తు. విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవ రాయులు కటకంపై దండయాత్ర చేసి విజయం సాధించినప్పుడు గుర్తుగా సంహాచలం కొండపై జయస్తంభం ప్రతిష్ఠించారు. అప్పుడు జరిగిన యుద్ధాల్లో సోంపాళ్యం పాలేగారు ద్వాదశి కృష్ణమనాయుని, ఆయన సోదరులు రాజేంద్రనాయుని, జయధననాయునులు తమ సైన్యంలో రాయలవారికి బాసటగా నిలిచారు. వారు సాధించిన విజయాలకు గుర్తుగా సోంపాళ్యం కోట సమీపంలో జయస్తంభం ఏర్పాటు చేశారు.



పురాతన నందీశ్వరుడి ఆలయం



పురాతన శ్రీమత్కోట చౌడేశ్వరిదేవి ఆలయం

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

- సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: జిల్లాలో నమోదయ్యే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలని... నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనా.. నిర్లక్ష్యం చేయకుండా సత్వరం పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదైన కేసుల్లో జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. కేసుల పరిష్కారంలో భాగంగా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ కాగానే బాధితులకు పరిహారం అందజేసేలా సంబంధిత అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డీవీయంసీ కమిటీ సభ్యులకు సూచించారు. 2023 నవంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు జిల్లాలో 15 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదై విచారణ దశలో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతి, ఆయా అంశాల్లో తీసుకున్న చర్యలపై డీవీయంసీ సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్, ఎస్పీ నివృత్తి చేశారు. ఈసందర్భంగా రాయచోటిలో అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో అన్ని మండ లాల్లో ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు కూడా ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు విన్నవించారు.

సార్వత్రిక ఎన్నికల్లో పకడ్బందీగా విధులు చేపట్టాలి : ఎస్పీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ విధులను పకడ్బందీగా చేపట్టాలని ఎస్పీ కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులకు సార్వత్రిక ఎన్ని కలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆయా సబ్‌డివిజన్‌లు, సర్కిల్స్‌తో పాటు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో గట్టి బందో బస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యా దులపై స్పందించి.. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. ఎన్నికల చట్టాలు, నియమాలపై ఎటువంటి విమర్శలకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీటీ రాజ్‌కమల్, అన్ని సబ్‌డివిజన్‌ల పోలీసు అధికారులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



హాజరైన పోలీసు అధికారులు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాప్తాడు సీఎం సభకు రైల్వేకోడూరు స్కూళ్ల బస్సులు!



గత నెల 3న ప్రైవేటు స్కూలు బస్సులో జనాలను తరలించిన దృశ్యం (ఫైల్)

- ఈ నెల 17న సిద్ధం చేయాలని హుకుం
- మల్లగుల్లాలు పడుతున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 13: అనంతపురం జిల్లా రాప్తాడులో ఈ నెల 18న ఏర్పాటు చేసిన సీఎం జగన్ సభ కోసం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ప్రైవేటు సూళ్ల బస్సులను పంపాలని డివిజన్‌స్థాయి అధికారి హుకుం జారీ చేసిన విషయం మంగళవారం వెలుగు చూసింది. ఈ నెల 17న స్కూళ్ల బస్సులు సిద్ధం చేసి తమకు అప్పగించాలని పాఠశాలల యాజమా న్యాలకు డివిజన్‌స్థాయి అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. రాప్తాడులో జరిగే సీఎం సభకు బస్సులు పోయి రావాలంటే సుమారు 500 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రానుపోను 12 గంటల సమయం పడుతుంది. దీంతో బస్సులను పంపిస్తే అంత దూరం వెళ్లి వచ్చే సరికి బస్సు డ్రైవర్లు ఇబ్బందికి గురౌతారని, మరుసటి రోజు విద్యార్థులను దూర ప్రాంతాల నుంచి స్కూళ్లకు తరలించాలంటే ఇబ్బందిగా ఉంటుందని స్కూళ్ల యాజమా న్యాలు మల్లగుల్లాలు పడుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం పరిధిలోనే నిబంధనల ప్రకారం స్కూళ్ల బస్సులను నడపాలని ఉంది. అయితే రాప్తాడుకు పోవాలంటే జిల్లా మారాల్సి ఉంది. అయినా పైనుంచి ఆదేశాలు వచ్చాయని, బస్సులు మాకు అప్పగించాలని డివిజన్‌స్థాయి అధికారి ఆదేశించినట్లు తెలిసింది. నియోజకవర్గంలో సుమారు 30 స్కూళ్లు ఉన్నాయి. ఇందులో 50 బస్సులు ఉన్నాయి. ఇదిలా ఉండగా గతంలో తిరుపతి పార్లమెంట్‌కు ఉప ఎన్నికలు సందర్భంలో ప్రైవేటు స్కూళ్ల బస్సులు పంపారు. ఇటీవల రైల్వేకోడూరులో వైసీపీ సభకు సూళ్ల బస్సులో జనాలను తరలించారు. ఇదే తరహాలో రాప్తాడుకు పంపాలని అధికారులు ఆదేశించడం కొసమెరుపు. ఈ విషయంపై రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ వివరణ ఇస్తూ.. సీఎం సభ జరిగే ప్రాంతం నుంచి 18వ తేదీ సాయంత్రానికి బస్సులు వచ్చేస్తాయని.. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు పడరని వివరించారు.

భగ్గుమన్న ఉపాధ్యాయ సంఘాలు

- డీఎస్సీ ప్రకటన జీవో ప్రతులను దహనం చేసిన యూటీఎఫ్ నాయకులు



డీఎస్సీ జీవో ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 13: ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ప్రకటనపై పీలేరులోని ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దాదాపు 30 వేల పోస్టులు ఉండగా.. కేవలం 6 వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటన విడుదల చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. అంతే కాకుండా అనేక పోరాటాలు చేసి రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. డీఎస్సీ ప్రకటనను నిరసిస్తూ యూటీఎఫ్ నాయకులు మంగళ వారం పీలేరు యల్లమంద క్రాసులో జీవో నెం.11 ప్రతులను దహనం చేశారు. ఈ సంద ర్భంగా యూటీఎఫ్ నాయకులు రాధాకృష్ణ, సదాశివరెడ్డి, శివారెడ్డి మాట్లాడుతూ మెగా డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తానని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు హామీ ఇచ్చిన జగన్, అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్ల ఎటువంటి ప్రకటన చేయకపోగా.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కేవలం 6 వేల పోస్టులను భర్తీ చేస్తా ననడం అన్యాయమన్నారు. అదే విధంగా గతంలో ఉన్న అప్రెంటీస్ విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఏళ్ల తరబడి పోరాటాలు, ఉద్యమాలు చేసి రద్దు చేసుకు న్నామని, జగన్ ప్రభుత్వం దాన్ని మళ్లీ ప్రవేశపెట్టడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులపై శీతకన్ను వేసిందని, సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి, దాని కంటే అన్యాయమైన జీపీఎస్‌ను తీసుకువచ్చిందన్నారు. జీపీఎస్ ద్వారా ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని శాంతియుతంగా చెప్పినా, పోరాటాలు, ఉద్యమాల ద్వారా చెప్పే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా బలవంతంగా తమపై రుద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. అందుకనే తాము వచ్చే ఎన్నికల సందర్భంగా ఏ పార్టీ ఓపీఎస్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఎన్నికల మేనిఫెస్టోలో పెడుతుందో ఆ పార్టీకే మద్దతివ్వాలని నిర్ణయించామని ప్రకటించారు. అనంతరం వారు యూటీఎఫ్ అధినాయకత్వం రూపొందించిన 'ఓట్ ఫర్ ఓపీఎస్' వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

మెగా కాదు... దగా డీఎస్సీ

ప్రభుత్వం విడుదల చేసింది మెగా డీఎస్సీ కాదు, దగా డీఎస్సీ అని నోబుల్ టీచర్స్ అసోసి యేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేశ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పట్టించుకోవడం లేదంటూ జగన్ ఆరోపించారని గుర్తు చేశా రు. ఆ 23 వేల పోస్టులతోపాటు జగన్ ప్రభుత్వంలో ఏర్పడిన ఖాళీలు లెక్కిస్తే సుమారు 50 వేలు అవుతాయన్నారు. వాటన్నింటినీ భర్తీ చేయకుండా కేవలం 6 వేల పోస్టులకే పరిమితం కావడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ నాయకులు అక్రమ్‌బాషా, రాధాకృష్ణ, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, మస్తాన్, వెంకటరమణ, సుధాకర్, వేణుగోపాల్, అన్నయ్య, మునిరెడ్డి, పేరయ్య, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


'తైలం' వచ్చేనా...!

- నిర్వహణ లేక మూతపడిన తైలం పరిశ్రమ
- తుప్పు పడుతున్న యంత్రాలు
- వినియోగంలోకి తెస్తే.. పలువురికి ఉపాధి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 13: గిరిపుత్రుల ఉపాధి కోసం నిర్మించిన చిన్నపాటి పరిశ్రమ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. దాదాపు 16 ఏళ్లుగా వినియోగంలో లేకపోవడంతో పరిశ్రమ లోని విలువైన యంత్రాలు తుప్పు పడుతున్నాయి. ప్రభుత్వం స్పందించి తైలం పరిశ్రమను వినియోగంలోకి తీసుకువస్తే గిరిపుత్రలకు ఉపాధి దొరుకుతుందని పలువురు చెబుతున్నారు.

తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని ఇట్నేనివారిపల్లెలో సుమారు 80 కుటుంబాల వరకు యానాదులు నివసిస్తున్నారు. గ్రామానికి సమీపంలో సాధుకొండ, మల్లయ్యకొండ, ఇనుముకొండల సముదాయాలు ఉన్నాయి. పలువురు ఈ అడవుల్లో సహజ సిద్ధంగా లభించే తేనే, నన్నారివేర్లు, ఉసిరి, ఈత కాయలు, పాలగడ్డ, పలు రకాల ఆయుర్వేద మూలికలు అమ్ముకుని జీవనం సాగిస్తుంటారు. దీంతో పాటు ఈ మూడు కొండల్లో బోధ సమృద్ధిగా లభిస్తుంది. దీంతో గిరిపుత్రులకు సొంత గ్రామంలోనే ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి పరచాలని అప్పటి అటవీశాఖాధికారి ఎస్‌డీఎఫ్ సైద్‌మెన్, రేంజర్ దామోదర్‌రెడ్డి సంకల్పించారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి బోధ, నీలగిరి ఆకుల నుంచి తైలం తీసే పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేశారు.

తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని ఇట్నేనివారిపల్లెలో 2008 సంవత్సరంలో రూ.3.50 లక్షలతో సిద్ధార్థ వీఎస్ఎస్ (వన సంరక్షణ సమితి) కింద బోధ, నీలగిరి, పాము రోజా, కాశాకు, దవణం వంటి వాటి నుంచి తైలం తయారు చేసే చిన్నపాటి పరిశ్ర మను ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమను అప్పటి ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి ప్రారం భించారు. ఇట్నేనివారిపల్లెకు చెందిన అప్పటి వీఎస్ఎస్(వన సంరక్షణ సమితి) చైర్మన్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో గిరిపుత్రులు అడవుల్లో బోధను సేకరించి పరిశ్రమలో తైలం తయారు చేసేవారు. తైలానికి మంచి గిరాకీ ఉండటం, తైలాన్ని పలు సుగంధ ద్రవ్యాలు, ఆయుర్వేద మందులలో ఉపయోగిస్తుండటంతో బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర వంటి పెద్ద నగరాలలోని మార్కెట్‌లలో విక్రయించారు. మొదట్లో ఈ పరిశ్రమ నిర్వహణ సజావుగా సాగగా.. అప్పట్లో పరిశ్రమ ద్వారా ప్రతి రోజూ సుమారు 20 నుంచి 30 మంది వరకు ప్రత్యక్షంగా ఉపాధి పొందేవారు. తర్వాత కొద్ది నెలలకు అడవులకు నిప్పు పడి బోధ కాలిపోవడం, మార్కెట్‌లో తైలానికి గిట్టుబాటు ధర లభించకపోవడం తదితర కారణాలతో పరిశ్రమ నిర్వహణ కష్టతరంగా మారి 2010లో మూతపడింది. అప్పటి నుంచి పరిశ్రమవైపు కన్నెత్తి చూసేవారు లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తైలం పరిశ్రమను వినియోగంలోకి తీసుకువస్తే స్థానికంగా పలువురు గిరిపుత్రలకు ఉపాధి దొరికి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడినట్లవుతుంది.



తుప్పుపడుతున్న పరిశ్రమలోని యంత్రాలు



మూత పడిన తైలం పరిశ్రమ

గాలిలో దీపంలా లష్కర్లు

- 2020లో విధుల్లోకి 120 మంది
- మంచి భవిష్యత్తు అంటూ ఆశపడ్డ నిరుద్యోగులు
- డిసెంబరుతో కాంట్రాక్ట్ ముగిసిందంటున్న అధికారులు
- దిక్కుతోచని స్థితిలో లష్కర్లు


సీబీఆర్ కాల్వ వద్ద పనులు చేస్తున్న లష్కర్లు (ఫైల్)

లింగాల, ఫిబ్రవరి 13: పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాళెం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నుంచి పంప్‌హౌస్‌ల ద్వారా గ్రామాల్లోని వంకలు, వాగులు, చెరువులకు నీటిని నింపే ప్రక్రియ విజయవంతంగా కొనసాగేందుకు లష్కర్ల నియామకం చేపట్టారు. ప్రధాన రిజయర్వార్ల వద్ద గేట్లు ఎత్తడం, కాల్వల్లో నీటి పారుదలకు అడ్డులేకుండా చూడడం, అక్రమంగా ఎవ్వరూ నీటిని తరలించకుండా చూడడం, కంపచెట్లు పెరగకుండా చేయడంలో లష్కర్లదే కీలక పాత్ర. వందల కిలోమీటర్ల మేర ఎలాంటి అడ్డంకులు లేకుండా నీటిని తరలించే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత లష్కర్లపై ఉంటుంది. ఇలాంటి లష్కర్లు ప్రస్తుతం గాలిలో దీపంలా ఉన్నారు.

కీలకంగా లష్కర్లు

పులివెందుల నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో కాల్వల్లో ఎటువంటి సమస్యత లెత్తకుండా నీటి తరలింపును పర్యవేక్షించేందుకు 2020 సెప్టెంబరులో దాదాపు 120 మంది లష్కర్లను ఇరిగేషన్ శాఖ నియమించుకుంది. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ద్వారా బిల్లులు చెల్లించేలా కాంట్రాక్ట్ ఏర్పాటు చేసి ఆ కాంట్రాక్టర్ ద్వారా నెలకు రూ.7వేల వేతనం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. కాల్వల్లో ఉన్న పూడికను తొలగించడం, కాల్వలపై ఉన్న ముళ్లపొదలను తొలగించడం, పంప్‌హౌస్‌ను క్లీనింగ్ చేయడం, కాల్వల్లో నీరు సక్రమంగా వెళుతోందా లేదా అని పర్యవేక్షించడం వీరి విధి. దీంతో నిరంతరం కాల్వలపై ఎండననక, వాననక, రాత్రింబవళ్లు లష్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు నెలలకు, ఐదు నెలలకు ఒకసారి వేతనం ఇస్తున్నప్పటికీ, తక్కువ వేతనం అయినా.. భవిష్యత్తు బాగుంటుందనే ఆశతో వారు విధులు నిర్వహిస్తూ వచ్చారు. గత ఏడాది రూ.3 వేలు వేతనం పెరగడంతో ఇక తమ జీవితాలు బాగుపడతాయని ఆశించారు. సీఎం వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం కావడంత తమ ఉద్యోగాలు పర్మనెంటు చేస్తారనీ నమ్మారు. ఇంతగా ఆశపడ్డ లష్కర్లకు ఒక్కసారిగా వారి జీవితం చీకటిమయం అయిపోయింది. గత ఏడాది డిసెంబరుతో కాంట్రాక్ట్ అయిపోయిందని ఇరిగేషన్ అధికారులు లష్కర్లకు తెలిపారు. ప్రస్తుతం విధులకు హాజరు అయినా జీతాలు చెల్లించే అవకాశం లేదని తేల్చిచెప్పినట్లు సమాచారం.

భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి

తమ భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలంటూ లష్కర్లు వేడుకుంటున్నారు. తమపై ఆధారపడ్డ కుటుంబాలు ఉన్నాయని, అరకొర జీతం అయినప్పటికి భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశంతో పనులు చేశామని చెబుతున్నారు. ఉన్నట్టుండి డిసెంబరుతో కాంట్రాక్ట్ అయిపోయిందని, ఇక జీతాలు రావని చెప్పడంతో ఏం చేయాలో తమకు అర్థం కావడం లేదన్నారు. అధికారులను అడిగితే మీ శ్రమ వృథా కానివ్వం అని చెబుతున్నారే తప్ప కచ్చితమైన హామీ రాలేదని అంటున్నారు. ముఖ్యమంత్రి స్పందించి తమను ఆప్కాస్ కింద నియమించి లష్కర్లుగా కొనసాగించాలని కోరుతున్నారు. లష్కరు లేకుండా నీటి రిజర్వాయర్ల కాల్వల నిర్వహణ సాధ్యం కాదు. వీరిని కొనసాగించి నీటి పారుదలలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పులివెందుల నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. వీరి ఎమ్మెల్యే, సీఎం అయిన వైఎస్ జగన్ ఏమేరకు స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

వేతనాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాం

లష్కర్లు లేకుండా వాటర్ రెగ్యులేషన్ కష్టమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. లష్కర్లకు ఎలాగోలా వేతనాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాం.

– ప్రదీప్‌రెడ్డి, డీఈ, ఇరిగేషన్, పులివెందుల

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటిస్తూ ప్రయాణం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫకృద్దీన్ సూచించారు. మంగళవారం కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 35వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ప్రజారవాణాలో మహిళలకు రహదారి భద్రత, బస్సుల్లో మహిళల సీట్ల ప్రాధాన్యత, 354ఎ ఐపీసీ 506 ఐపీసీతో పాటు మరికొన్ని చట్టాలు సెక్షన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ నసీం, కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా, లెక్చరర్లు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఒకరి మృతి


మృతిచెందిన లక్ష్మీ శేఖర్

పుల్లంపేట, ఫిబ్రవరి13 : పుల్లంపేట మండలం ప్రకాష్ నగర్ కాలనీ వద్ద కడప-చెన్నై రహదారిలో మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇరువురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు అనంతంపల్లెకు చెందిన మేకల లక్ష్మీశేఖర్ (20), రంగంపల్లె పంచాయతీ ఉప్పరపల్లె గ్రామానికి చెందిన సాయిలు రాజంపేట నుంచి ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో ముందు స్కూటీపై వెళుతున్న బోయనపల్లెకు చెందిన రామ్మోహన్ ప్రకాష్ నగర్ కాలనీ సమీపంలోకి రాగానే స్కూటీని పక్కకు తిప్పడంతో వెనుక వస్తున్న బైకు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీశేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. సాయి తీవ్రంగా గాయపడగా రామ్మోహన్ స్వల్పంగా గాయపడ్డాడు. రామ్మోహన్ విద్యుత్ శాఖలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తీవ్రంగా గాయపడిన సాయి, స్వల్పంగా గాయపడిన రామ్మోహన్‌ను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సాయిని తిరుపతికి రెఫర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుల్లంపేట ఎస్ఐ రఘురాం తెలిపారు.

బొలేరా ఢీ...వ్యక్తికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి13: మండలంలోని రవీంద్రనగర్ మర్రిమాను వద్ద మంగళవారం నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి వచ్చిన బొలేరో ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మద్దిరేవుల పంచాయతీ జీఎంఆర్ కాలనీకి చెందిన విజయ్ అనే వ్యక్తి పనిమీద లక్కిరెడ్డిపల్లెకు వచ్చి వెళుతూ మర్రిచెట్టు వద్దకు వచ్చేసరికి ఫోన్ వచ్చింది. దీంతో బైకును ఆపి ఫోన్‌లో మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన బొలేరా వాహనం బైకును ఢీ కొట్టడంతో విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈమేరకు వెంటనే 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించ ఆసుపత్రిలో డాక్టర్లు ఎవరూ లేకపోవడంతో ఓ నర్సు చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రుని బంధువులు కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు తరలించారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వస్తే డాక్టర్ లేకుంటే ఎలా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గన్‌మెన్ల కేటాయింపులో ప్రతిపక్షాలపై వివక్ష

- చీఫ్ ఎన్నికల కమిషనర్‌కు ఎమ్మెల్సీ ఫిర్యాదు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 13: రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం పోలీసులతో భద్రత కల్పించిందని అయితే అధికార, ప్రతిపక్ష పార్టీలకు గన్‌మెన్లను కేటాయించడంలో వివక్ష చూపించారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఆరోపించారు. రక్షణ కల్పించడంలో ఉన్నతాధికారులు పారదర్శకంగా వ్యవహరించే విధంగా తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు చీఫ్ ఎన్నికల కమిషనర్‌కు ఆయన ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి కనీసం 2 ప్లస్ 2 నుంచి 4 ప్లస్ 4 భద్రత కేటాయించారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు 1 ప్లస్ 1 మాత్రమే ఇచ్చారని ఇది ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతిపక్షాలకు ఈ రాష్ట్రంలో భద్రత లేదని దీన్ని సరిదిద్దేందుకు తగు చర్యలు తీసుకోవాలని మనవి చేశారు. రాష్ట్రంలో ఎవరికి భద్రత కల్పించాలన్నా సెక్యూరిటీ రివ్యూ కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటారన్నారు. ఇక్కడ మాత్రం అధికార పార్టీ వారు ఎవరికి చెబితే వారికే గన్‌మెన్లను ఇస్తున్నారన్నారు. ఇంకా కొంత మంది నాయకులకు వెపన్ లేకుండా గన్‌మెన్లను ఇచ్చారన్నారు. ఇది పూర్తిగా అధికార దుర్వినియోగమేనని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్నికి ఆహుతైన అరటి తోట



పులివెందుల టౌన్, ఫిబ్రవరి 12: మండలంలోని ఇ.కొత్తపల్లెలో అరటి పంట అగ్నికి ఆహుతైన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వాడపల్లె బాష అనే రైతు నాలుగు ఎకరాలలో అరటి సాగు చేశారు. మరో రెండు నెలల్లో దిగుబడులు వస్తాయి. ఈ సమయంలో సోమవారం సాయంత్రం ఉన్నఫళంగా అరటితోట అగ్నికి ఆహుతైంది. ప్రమాదానికి కారణమైతే తెలియలేదు. మరో రెండు నెలల్లో కోతకు వచ్చే సమయంలో అరటి పంట అగ్నికి ఆహుతవడంతో దాదాపు రూ.8లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థి అదృశ్యం



బద్వేలు టౌన్, ఫిబ్రవరి 13 : పట్టణంలోని ముబారక్‌కాలనీ మదరసాలో చదువుతున్న సయ్యద్ అమానుల్లా బుఖారీ (17) అనే విద్యార్థి ఆదివారం మదరసా పాఠశాలలో అదృశ్యం కావడంతో మంగళవారం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కడప పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ అమానుల్లాబుఖారీ బద్వేలు పట్టణంలో ముబారక్ కాలనీలో ఉండే మదరసాలో చదువుతున్నాడు. అయితే ఇంటి వద్ద నుంచి విద్యార్థి తల్లి మదరసా పాఠశాలకు ఫోను చేసి తమ కుమారుడిని ఇంటికి పంపాలని కోరగా అక్కడి టీచర్లు అబ్బాయిని పాఠశాల నుంచి పంపించారు. విద్యార్థి పాఠశాల నుంచి ఇంటికి వెళ్లకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలకు ఫోను చేశారు. వారు రాలేదని చెప్పడంతో మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జనసేన రాయలసీమ జోన్-1 కో కన్వీనరుగా పంద్ర


పంద్ర రంజిత్‌కుమార్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 : జనసేన ఎన్నిక కార్యక్రమాల నిర్వహణ రాయలసీమ జోన్-1 కమిటీ కో-కన్వీనరుగా పంద్ర రంజిత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జనసేన 2024 ఎన్నికల కార్యక్రమాల నిర్వహణకు తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలు పాటిస్తూ రాయలసీమ జోనల్ పరిధిలోని నియోజకవర్గాల్లో జనసేన పార్టీ కార్యక్రమాలు, సభల విజయవంతానికి కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా పోలీసు శాఖ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా బి.రాజాప్రభాకర్

కడప (క్రైం), ఫిబ్రవరి 13 : జిల్లా పోలీసు శాఖ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా బి.రాజాప్రభాకర్‌ను నియమిస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, సోషల్ మీడి యాలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు పోలీసు శాఖ, మీడియాకు వారధిగా ప్రభాకర్ వ్యవహరిస్తారన్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డర్ అవార్డు గ్రహీత మృతి



కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 13 : కడపకు చెందిన మిస్టర్ ఆంధ్ర (బాడీబిల్డర్) అవార్డు గ్రహీత షంషుద్దీన్(63) గుండెపోటుతో మంగళవారం సాయంత్రం కడపలో మరణించారు. ఆయన మృతికి బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నూనె నగేష్, షేక్ యూనస్ బాషాలు తమ సంతాపం వ్యక్తం చేశారు.

మద్యం బాటిళ్ల పట్టివేత - ముగ్గురు అరెస్టు



కడప (క్రైం), ఫిబ్రవరి 13 : కడప నగరం మహావీర్ సర్కిల్ వద్ద మద్యం బాటిళ్లు అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సెబ్ ఎస్ఐ తెలిపారు. కమలాపురం మండలం గంగవరం గ్రామానికి చెందిన బాలస్వామి, శివరాం, పలిబాలును అరెస్టు చేసి వారి నుంచి 318 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

- నేటి నుంచి ప్రత్యక్ష ఆందోళనలు
- 27న చలో విజయవాడ
- ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో మొండిగా వ్యవహరిస్తే బుధవారం నుంచి ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధం కాక తప్పదని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ హెచ్చరించారు. నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు ప్రభుత్వానికి సహకరిస్తున్నప్పటికీ సరైన స్పందన లేదన్నారు. ఈనెల 12వ తేదీన బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఏపీ జేఏసీ జరిపిన చర్చలు కొలిక్కి రాలేద న్నారు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే బుధవారం నుంచి ప్రత్యక్ష ఆందోళనలకు దిగడంతో పాటు ఈనెల 27 చలో విజయవాడ చేపడతామన్నారు. 12వ పీఆర్సీ 30 శాతం ప్రకటించాలని, సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలు, సీపీఎస్ వారికి డీఏ బకాయిలు 90 శాతం నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. 11 వ పీఆర్సీ, అరియర్స్, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్, మెడికల్ రీయింబర్సుమెంట్ క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై ఉద్యమ కార్యచరణకు సిద్ధమంటూ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ



దొంగలు పగలగొట్టిన బీరువా, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ

రాజంపేట టౌన్, ఫిబ్రవరి13 : మండల పరిధిలోని కూచివారిపల్లె శివారులోని రెండిళ్లలో మంగళవారం పట్టపగలే దొంగలు పడ్డారు. పట్టణ సీఐ మద్దెయ్య ఆచారి తెలిపిన వివరాల మేరకు గ్రామ శివారులోని బాబు నాయుడు, రెడ్డిప్రసాద్ కుటుంబ సభ్యులు ఇళ్లకు తాళాలు వేసి పెళ్లికి వెళ్లారు. ఈ విషయం గమనించిన దుండగులు తాళాలు పగులగొట్టి ఇళ్లలో చొరబడ్డారు. బాబు నాయుడు ఇంట్లో 150 గ్రాముల బంగారం, రెడ్డిప్రసాద్ ఇంటిలో రెండు జతల కమ్మలు, మాటీలు, ఉంగరాలు చోరీ చేయడమే కాకుండా బీరువాలోని నగదు కూడా దోచుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దోచుకెళ్లిన వస్తువుల విలువ సుమారు మూడు లక్షలు రూపాయలు ఉంటుందని వివరించారు.

పాత పెన్షన్‌పై పార్టీల వైఖరి తెలపాలి

- యూటీఎఫ్ పోస్టు కార్డులు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 13 : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగ ఉపాధ్యాయుల పదవీ విరమణ అనంతరం సమాజంలో గౌరవంగా జీవించడానికి పాత పెన్షన్ విధానం అవసరమని.. అలాంటి పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీల వైఖరి ఏంటో తెలపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కడప నగరం ప్రధాన కార్యాలయం వద్ద అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు పోస్టు కార్డు ద్వారా తమ డిమాండ్లను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా భవిష్యత్తు నిర్ణయించేది మేం ఎన్నుకునే నాయకులే కావచ్చు.. అయినా మా సమస్యలు పరిష్కరించలేనపడు వారి రాజకీయ భవిష్యత్తు నిర్ణయించేది కూడా మా ఓటేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అందుకే ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో ఎవరైతే పాత పెన్షన్ ఇస్తామని మేనిఫెస్టో చేసి అధికారంలోకి వచ్చాక మొదటి సంతకం చేస్తారో వారికే తమ ఓటుతో పాటు మా కుటుంబ సభ్యులు ఓట్లు కూడా వేయిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగ ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణ, ఎజాజ్ అహ్మద్, గోపినాథ్, అబ్దుల్‌గణి, ఇహాజితుల్లా, సుజిత్‌కుమార్, వీరనారాయణ పాల్గొన్నారు.


పోస్టుకార్డులు చూపుతున్న యూటీఎఫ్ నేతలు

విజిలెన్సు దాడుల్లో రేషన్‌బియ్యం పట్టివేత


రేషన్‌బియ్యం వాహనాన్ని పట్టుకున్న విజిలెన్సు అధికారులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 : ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్సు అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో టాటా ఏసీ వాహనంలో దాదాపు 45 రేషన్‌బియ్యం బస్తాలను అక్రమంగా తరలిస్తుండటంతో బొల్లవరం గ్రామం పొట్టిపాడురోడ్డు వద్ద విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. దాదాపు 2090 కేజీలుండే రేషన్‌బియ్యం సుమారు రూ.2,84 640 విలువ చేస్తాయని విజిలెన్సు అధికారులు తెలిపారు. ఈరేషన్ బియ్యాన్ని ప్రొద్దుటూరుకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ప్రొద్దుటూరు దాని చుట్టుపక్కల గ్రామాలనుంచి సేకరించి నరేంద్ర అనే వ్యక్తికి విక్రయించటానికి వెళుతుండగా విజిలెన్సు అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఎల్ఆర్ఐ సాయిప్రసాద్, విజిలెన్సు సీఐ రెడ్డెప్ప, హెడ్‌కానిస్టేబుల్ జనార్థనరావు, కానిస్టేబుల్ రంతుబాష పాల్గొన్నారు. బియ్యం అక్రమ రవాణాపై త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్‌కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ప్రమాదవశాత్తు కుందూలో పడి వ్యక్తి మృతి



రాజుపాలెం, ఫిబ్రవరి 13 : దువ్వూరు మండలం కానగూడూరు గ్రామానికి చెందిన గుడిపాటి హుస్సేన్‌బాషా (35) అనే వ్యక్తి మంగళవారం ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టంగుటూరు గ్రామ పొలంలోని తమ పొలం వద్ద పనిచేసుకుంటూ కుందూనది వద్దకు నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడికి కుమార్తె ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

40 గొర్రెలు మృతి, మరికొన్నింటికి తీవ్రగాయాలు


లారీ దూసుకెళ్లడంతో నుజ్జునుజ్జయిన గొర్రెలు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 13 : ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె వద్ద జమ్మలమడుగు రోడ్డులో మంగళవారం తెల్లవారుజామున గొర్రెలమందపై లారీ దూసుకెళ్ళిన ఘటనలో 40 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. మరికొన్నింటికి తీవ్ర గాయాలయ్యాయి.వివరాల్లోకి వెళితే జమ్మలమడుగు నియోజకవర్గం బొమ్మేపల్లెకు చెందిన చౌడయ్యచంద్రానాయక్ గొర్రెల మందను తీసుకుని జమ్మలమడుగు నుంచి దువ్వూరుకు వెళుతున్నారు. కాగా మంగళవారం తెల్లవారుజామున 5గంటల సమయంలో గుర్తు తెలియని లారీ గొర్రెల మందపై దూసుకెళ్ళింది.దీంతో గొర్రెలన్నీ నుజ్జునుజ్జు అయ్యాయి. గొర్రెల యజమాని చౌడయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది

కాంగ్రెస్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 13: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఓటమి భయం పట్టుకుని మాట్లాడుతున్నాడని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షర్మిలపై వైసీపీ నాయకులు చేత జగన్‌మోహన్‌రెడ్డి అసభ్యపదజాలం ఉపయోగించి మాట్లాడించడం మంచి పద్ధతి కాదన్నారు. చెల్లిని అవమానకరంగా మాట్లాడితే తన తల్లికి కూడా తగులుతుందన్న ఇంకిత జ్ఞానం కూడా లేకుండా.. షర్మిల రాజశేఖర్‌రెడ్డి కూతురు కాదని మాట్లాడించడం రాజశేఖర్‌రెడ్డి సతీమణిగా విజయమ్మను అవమానించడమేనని ఆయన విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి కోసం షర్మిల పనిచేసినప్పుడు మంచి వ్యక్తిగా కనబడి ఇప్పుడు ఎలా చెడ్డ వ్యక్తి అయ్యారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో టీడీపీ, వైసీపీ నాయకులు పెద్దఎత్తున సంప్రదింపులు జరుపుతున్నారని.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలపడటంతో పాటు అధికారమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు.

కర్ణాటక, తెలంగాణాలో కాంగ్రెస్ సత్తా చాటిందని.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రానున్న ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితాశయం రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే అని.. ఆయన చనిపోయే ముందు కూడా ప్రకటించారని.. ఆ లక్ష్యం కోసమే తన కుమార్తె షర్మిల పనిచేస్తున్నారని తులసిరెడ్డి అన్నారు. రాజంపేట కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి మనోహర్ బాబు, నాయకులు శ్రీనివాసులు, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

రాజంపేట టౌన్, ఫిబ్రవరి13 : ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు వై.బ్లిసన్ 88 శాతం, పి.పవాజ్ ఖాన్, 75 శాతంతో ఉత్తీర్ణత సాధించినట్లు రీజెన్సీ నలందా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు మంగళవారం తెలిపారు. విద్యాసంస్థల సీఈవో జి.చందు, కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.నరసయ్య ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

విద్యుత్ లైన్‌పై తొలగిన చెత్త



సమస్య పరిష్కరిస్తున్న అధికారులు

సంబేపల్లె, ఫిబ్రవరి 13: విద్యుత్ లైన్‌పై చెత్త.. ఆందోళనలో గ్రామస్తులు అన్న శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డిస్కం డీఈ విజయ్‌కుమార్, ఏఈ రాజేశ్ సిబ్బందితో కలిసి లైన్‌పై చెత్తను తొలగించారు. స్థానికంగా సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 13: నదినీ వదల్లేదు శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించరాదంటూ ఆయా స్థలాల వద్ద మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు ఉప తహసీల్దార్ అమరేశ్వరి మాట్లాడుతూ నది పోరంబోకు స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పునాదులు ఏటిపాలు.. నిధులు నీటి పాలు

● ఆగిపోయిన ఎల్లంరాజు ఆనకట్ట నిర్మాణం ● ఆవిరైన రైతుల ఆశలు ● పనులు పూర్తి చేయాలని వినతి



ఆనకట్ట లేకపోవడంతో వృథా అవుతుతున్న నీరు



ఆగిపోయిన మట్టికట్ట నిర్మాణం

చిట్వేలి, ఫిబ్రవరి 13 :ఆనకట్ట నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోవడంతో పునాదులు ఏటిపాలు.. నిధులు నీటిపాలయ్యాయని చిట్వేలి మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెర్లోపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో రాజుకుంట, యల్లంరాజు చెరువు అలుగుల నుంచి వచ్చేనీరు, అడవి నుంచి వచ్చేవరద నీరు కలిసే ప్రాంతంలో 2007లో రూ.1.25 కోట్ల వ్యయంతో ఆనకట్ట పనులు ప్రారంభించారు. ఈ ఆనకట్ట నిర్మాణంతో కొత్త చెరువు ఏర్పాటు కావడంతోపాటు, యల్లమరాజుచెరువు ఆయకట్టు స్థిరీకరణ, 350 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు, కింది ఉన్న అలుగు ఏరు పరిసరాలు కోతకు గురి కాకుండా నివారించడం సాధ్యమవుతుంది. దీంతో అప్పటి రైల్వేకోడూరు ఎమ్మెల్యే గుంటి వెంకటేశ్వరప్రసాద్ ఆనకట్ట నిర్మాణం ప్రతిపాదించి నిధులు మంజూరు చేయించారు. అప్పట్లో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పునాది వరకూ పనులు చేసి వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ ఆనకట్ట నిర్మాణాన్ని పాలకులుగానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో నిధులు నిరుపయోగంగా మారాయి. దీంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఈ ఆనకట్టతో ఎన్నో ప్రయోజనాలున్నా వదిలేయడం అన్యాయమని ఆయుకట్టుదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ఆనకట్ట నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

విందులో రాజకీయ సందడి



మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడుతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు



ద్వారకనాథరెడ్డి ఇచ్చిన విందు కార్యక్రమానికి వస్తున్న టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం తదితరులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13: పట్టణంలోని కొత్తపేటలోని టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి మంగళవారం విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, స్థానిక నేత మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు రాయచోటి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే ఎన్నిక ల్లో రాజంపేట పార్లమెంట్‌తో పాటు 7 అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'హార్సిలీహిల్స్‌లో భూ కేటాయింపు' ఉత్తర్వులు ఇవ్వొద్దు

● టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి13: హార్సిలీహిల్స్‌లో యాత్ర-2 దర్శకుడికి రెండు ఎకరాల భూమిని కేటాయించే ఉత్తర్వులను నిలుపుదల చేయాలంటూ టీడీపీ రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జై భీమ్ భారత్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ కన్వీనర్ కోన భాస్కర్, సీపీఐ మదనపల్లె నియోజకవర్గం కార్యదర్శి కె. మురళి, బీసీ అధికార ప్రతినిధి మెజారి సదాశివ, కంటేవారిపల్లె శివ, తుమ్మగింజల వెంకటేశ్, రాజారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హార్సిలీహిల్స్ ప్రముఖ పర్యా టక కేంద్రంగా ప్రసిద్ధిగాంచిందన్నారు. రాష్ట్రపతి, గవర్నర్లు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు తరచూ ఇక్కడ విడిది చేస్తుంటారన్నారు. పర్యాటక రంగానికి హార్సిలీహిల్స్ కల్పతరువు లాంటిదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జీవితాలను తెరపై చూపించినందుకు నజరానాగా రూ.20 కోట్లు విలువ చేసే భూమిని అప్పగించడ సమంజసం కాదన్నారు. ఒక వేళ నిజంగా రాయలసీమలో సినిమా షూటింగులు చేయాలనుకుంటే అనువైన ప్రాంతాలు అనేకం ఉన్నాయని సూచించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వైసీపీ ప్రభుత్వం ఈ చర్యకు పూనుకుందన్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ బీసీ సెల్ నాయకులు

గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయండి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని, 16న గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్ లో రైతులు, కార్మికులందరూ పాల్గొని మోడీ కార్పొ రేట్ అనుకూల, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు పీఎల్ నరసింహులు, లీలావతి, నాగేశ్వరి, సరోజమ్మ, ఎంఎస్ రాయుడు, సికింధర్, గాలి చంద్ర, గంగా .ధర్, సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, మురళి, సురేశ్ కుమార్, దేవా, మస్తాన్, నరసిం హులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి

ఓబులవారిపల్లె: కార్మికులు, రైతుల సమస్యల పరి ష్కారం కోసం ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు ఏపీఎండీసీ అవుట్ సోర్స్ అండ్ ట్రైనీ కార్మికులు సీపీవో సుదర్శన్‌రెడ్డికి నోటీసును అందజేశారు. ఈ సంద ర్భంగా కార్మిక నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ సీ అండ్ డి గ్రేడు రాయి విలువ 2వేలు ఉండగా, రూ.1200కే టెండర్ పిలవడం వల్ల ఏపీఎండీసీ సంస్థకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్మిక సంఘ నాయకులు వెంకటేష్, భాస్కర్, సుబ్బరాయుడు తెలిపారు.

ఇసుక రీచ్ కోసం స్థల పరిశీలన

నందలూరు, ఫిబ్రవరి 13: మండలంలోని టంగుటూరు వద్ద బాహుదా నదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ మంగళవారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు. రీచ్ కోసం నిర్ణయించిన స్థలం వివరాలను రెవెన్యూ, మైన్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వస్తున్న విషయాన్ని అధకారులు గోప్యంగా ఉంచారు. కార్యక్రమంలో ఆర్డీవో మోహన్‌రాబు, మైన్స్ ఏడీ రవిప్రసాద్, డీటీ మోహన్‌కృష్ణ, మండల సర్వేయర్ ఓబయ్య, ఆర్ఐ సునీల్, వీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

గుజరాత్ నుంచి రామేశ్వరానికి వృద్ధుల పాదయాత్ర



వృద్ధ దంపతులను సన్మానిస్తున్న నాగేంద్ర

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 13: గుజరాత్ నుంచి రామేశ్వరం వరకు పాదయాత్ర చేస్తున్న వృద్ధ దంపతులు సన్మారాంజీ ఆయన ధర్మపత్ని సీతాబాయి మంగళవారం కోడూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర వారిని సన్మానించారు. 16 నెలల క్రితం యాత్ర ప్రారంభించిన వారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా రామేశ్వరం చేరుకుంటారని తెలిపారు. కస్తూరి సుబ్బారావు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలను బానిసలు చేస్తారా?: తులసిరెడ్డి

రాజంపేట, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలుగా మారి, రాష్ట్ర ప్రజలను కూడా అదే పంథాలోకి తీసుకెళు టతున్నాయని రాజ్యసభ మాజీ సభ్యుడు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్ని రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టి రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలకు తిలోదకాలు వదిలారన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికారని, దుగరాజపట్నం ఓడరేవు ఊసే లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంత వరకు మోక్షం లేదన్నారు. విశాఖ, విజయవాడ, మెట్రో రైలు ఊసే లేదని, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ఇంత వరకు మోక్షం లేదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం అమ్మాలని ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఏ మాత్రం బలం లేకపోయినా ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ కూడా లేకపోయినా రాష్ట్రానికి ద్రోహం చేసినా, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ప్రజలను మరోసారి మోసగిస్తున్నాయన్నారు. ప్రాంతీయ పార్టీలకు ప్రత్యేక హోదాను తెచ్చే శక్తి లేదని, చట్టాన్ని అమలు పరిచే సత్తా ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజలు సరైన గుణపాఠం చెబుతారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పూలభాస్కర్, మండల అధ్యక్షుడు జనార్థన్, పట్టణ అధ్యక్షులు కనిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ తులసిరెడ్డి

రాష్ట్ర భవిష్యత్తు కోసం సూపర్ సిక్స్ మేనిఫెస్టో



మేనిఫెస్టోపై వివరిస్తున్న అనిత దీప్తి

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 13 : రాష్ట్ర భవిష్యత్తు కోసం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ మేనిఫెస్టో ప్రవేశపెట్టారని క్లస్టర్ ఇన్‌చార్జి నాగినేని వెంకటరమణ తెలిపారు. మంగళవారం మండలంలోని కుక్కలదొడ్డి, శెట్టిగుంట, లక్ష్మీగారి పల్లె గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలతో కలిసి పర్యటించి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా మహిళలకు, యువతకు ఈ మేనిఫెస్టోలో ప్రథమ స్థానం కల్పించారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు మారాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు దుద్యాల అనితాదీప్తి, మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, శెట్టిగుంట సర్పంచ్ చంద్ర, యూనిట్ ఇన్‌చార్జి నీలకంఠయ్య, మావిళ్ల రామయ్య, సంతోష్, రవితేజ టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలకు ఇన్వర్టర్ విరాళం



కళాశాల ప్రిన్సిపాల్‌కు ఇన్వర్టర్‌ను అందిస్తున్న జనసేన నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 13 : రాజంపేట పట్టణంలోని ఉర్దూ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం జనసేన నేత అతికారి కృష్ణ ఇన్వర్టర్ అందజేశారు. విద్యుత్ అంతరాయం కారణంగా తర చూ ఇబ్బందులు ఎదురవుతుండడంతో ప్రిన్సిపాల్ అజయ్‌బాబు అభ్యర్థన మేరకు 20వేల రూపాయలు విలువ గల ఇన్వర్టర్, సామగ్రి ని జనసేన నేతలు, కార్యకర్తలు కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు హరికృష్ణ, మన్నేరు సూరిబాబు, గద్దె లక్ష్మణ్, హరి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత భవన్ నిర్మించాలి

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: జిల్లా కేంద్రంలో విశ్రాంత భవనం నిర్మించాలని పెన్షనర్లు మంగళ వారం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కేంద్రంలో 1,750 మంది పెన్షనర్లు ఉన్నామని తాము సమావేశాలు ఏ ర్పాటు చేసుకోవడానికి ఒక భవనం చూపించాలని వారు అర్జీలో పేర్కొ న్నారు. ఈ విషయాలపై గతంలో కూడా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయాలపై పూర్తిగా విచారించి త్వరలో ఏదో ఒక సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వివరించారు.

ప్రాణ రక్షణ కల్పించండి: ఎస్పీకి మహిళ వినతి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13: తాను కొనుగోలు చేసిన ఇంటిలో హక్కు ఉందంటూ సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు హరిజనవాడకు చెందిన హరిత అనే మహిళ దౌర్జన్యం చేయడంతోపాటు, ఇబ్బందులకు గురిచేస్తోందంటూ సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పట్టణంలోని హరినాథవీధికి చెందిన దార్ల ప్రసన్నకుమారి మంగళవారం తెలిపారు. గతంలో మారణాయుధాలు చూపుతూ తమను బెదిరించడంతో రాయచోటి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోకపోవడంతో హరిత కుటుంబ సభ్యులతో పాటు మరికొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 10న తమ ఇంటి సమీపంలోని అంగడి వద్దకు వచ్చి బెదిరించినట్లు ఫిర్యాదులో తెలియజేశారు. ఈ అంశాలపై విచారించి హరిత కుటుంబ సభ్యుల నుంచి మాకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ దార్ల ప్రసన్నకుమారి ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

పెనగలూరు ఎంపీడీవోగా హరిప్రసాద్‌రెడ్డి



పెనగలూరు, ఫిబ్రవరి 3 : పెనగలూరు మండల పరిషత్ ఎంపీడీవోగా తుమ్మలూరు హరిప్రసాద్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజంపేట మండల పరిషత్‌లో ఈవోఆర్‌డీగా పనిచేస్తున్న ఈయన పెనగలూరు ఎంపీడీవోగా నియమితు లయ్యారు. ఈ సందర్భంగా ఏవో పద్మభూషణ్‌రెడ్డి, ఈవోఆర్‌డీ బాలాకుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

సాయిలోకేష్‌కు యల్లటూరు సన్మానం



బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌ను సన్మానిస్తున్న జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 13: బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్‌ను రాజంపేట పట్టణంలోని ఆయన స్వగృహంలో జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టికెట్టు ఎవరికి కేటాయించినా వారి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు షబ్బీర్ అహమ్మద్, అరిగె రాం ప్రసాద్, పిండిబోయిన కృష్ణ, జనసేన నేతలు, మాజీ జెడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, నారదాసు రామచంద్ర, మౌలా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా నేతకు సన్మానం

రాజంపేట, ఫిబ్రవరి 13 : బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా ఎన్నికైన పునగాని పాపయ్య మంగళవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో సామాన్య కార్యకర్తకు కూడా ఎంతో విలువ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు షబ్బీర్ అలీ, కృష్ణా యాదవ్, మహిళా నేతలు సునీత నారాయణవర్మ, అమృతవల్లి పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: భారతీయ భారతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాయచోటి పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు జానం బాలాజీయాదవ్‌ను నియమిస్తూ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జిల్లా దేవదాయశాఖ అధికారి

చిన్నమండెం, ఫిబ్రవరి 13: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల పురోగతిని స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

టీడీపీ స్పోక్స్ పర్సన్‌గా చెంచు వేణుగోపాల్‌రెడ్డి



గాలివీడు, ఫిబ్రవరి13: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ వివిధ విభాగాలను సమాయత్తం చేసే పనిలో నిమగ్నమైంది. దీనిలో భాగంగా ఎన్ఆర్ఐ టీడీపీ యూఎస్ఏ సెయింట్ లూయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఉన్న గాలివీడు మండలానికి చెందిన చెంచు వేణుగోపాల్‌రెడ్డిని రాయలసీమ టీడీపీ స్పోక్స్ పర్సన్‌గా నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడం, చంద్రబాబును మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యమన్నారు. ప్రజాసమస్యలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల తోపాటు, పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలన ప్రజల్లోకి తీసుకెళతానన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేశ్, ఎన్నారై టీడీపీ ప్రతినిధులు కోమటి జయరాం, వేమన సతీశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

చురుగ్గా రైల్వే అండర్ బ్రిడ్జి పనులు



అండర్ బ్రిడ్జి పనులు చేస్తున్న కార్మికులు

నందలూరు, ఫిబ్రవరి13 : నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గతంలో రైల్వే గేటు మూసిన సమయంలో తొగురుపేట, పాటూరు- నాగిరెడ్డిపల్లె ప్రాంతాల ప్రజలు . ఇబ్బందులకు గురయ్యేవారు. అత్యవసర చికిత్సలకు వెళ్లేవారు, 108 అంబులెన్సులు, రైల్వేగేటు మూసిన సమయంలో ఆందోళనకు గురయ్యేవారు. గతంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పెద్ద వాహనాలు వెళ్లలేకపోయేవి. ప్రస్తుతం లారీలు, బస్సులు సైతం పోయేందుకు వీలుగా బ్రిడ్జి నిర్మిస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 13: పట్టణంలోని పురాతన ఆంజనేయ స్వామి ఆలయంలోని వినాయకుడు నాగమ్మ, నవగ్రహాలకు మంగళవారం భక్తులు అభిషేకాలు, ఆకు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కలపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేటి నుంచి ఉద్యోగుల ఆందోళన బాట


విలేకరులతో మాట్లాడుతున్న రాఘవులు

చిత్తూరు, ఫిబ్రవరి 13: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు హెచ్చరించారు. చిత్తూరులోని ఎన్‌జీవో భవనంలో మంగళవారం ఆయన సంఘ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 30శాతం ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండరు లీవు, జీపీఎఫ్, ఏపీ జీఎల్‌ఐ తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్, సీపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బుధవారం ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపడతామన్నారు. 15న భోజన విరామ సమయంలో నిరసన, 17న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసనలు, ర్యాలీలు, 20న జిల్లాకేంద్రంలో ర్యాలీ, ధర్నా ఉంటుందన్నారు. 21 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్ర నాయకులు జిల్లాలో పర్యటిస్తారన్నారు. 27న విజయవాడలో ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొనాలని ఆయన కోరారు. ఏపీ జేఏసీ కార్యదర్శి రఘు, నేతలు రమణ, చెంగల్రాయమందడి, భానుప్రకాష్, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తంరెడ్డి, ప్రదీప్ కుమార్, రమేష్, మహేష్, మురళి తదిరులు పాల్గొన్నారు.

గంజాయి, శ్రీగంధం విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గంగవరం, ఫిబ్రవరి 13: గంజాయి, శ్రీగంధం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. గంగవరం పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంగవరం పరిసర ప్రాంతాల్లో గంజాయి, శ్రీగంధం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రొంటకుంట్ల రోడ్డు సరస్వతీనగర్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో రెవిన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా జిలానీ బాషా ఇంటివద్ద దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో పట్టుబడిన సరస్వతీనగర్‌కు చెందిన జిలానీ బాషా, కెజీసత్రంకు చెందిన ఎం.కుమార్, పెద్దపంజాణీమండలం పెద్దకాపల్లికి చెందిన నిమ్మనపల్లి శేఖర్‌ను విచారించగా, గంజాయి, శ్రీగంధం గుట్టు బయటపడిందన్నారు. ఈ ముగ్గురు కలిసి గంజాయి, శ్రీగంధం విక్రయించి ఆ డబ్బుతో జల్సాలకు అలవాటుపడ్డారన్నారు. జిలాని బాషాకు అతడి కుమారుడే గంజాయి తీసుకొచ్చి అందించి, విక్రయించడానికి సహకరిస్తుండడంతో అతడిపైనా కేసు నమోదు చేశామన్నారు. జిలానీబాషా ఇంటివద్దే గంజాయి మొక్కలు పెంచుతున్నాడన్నారు. ముగ్గురు నిందితులతో పాటు, కిలో గంజాయి, 2.9 కిలోల శ్రీగంధంను సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

సీఎం సభకోసం స్థల పరిశీలన!

శాంతిపురం, ఫిబ్రవరి 13: శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె సమీపంలోని హెరిటేజ్ వద్ద ఉన్న సెరికల్చర్ స్థలాన్ని, దానికి ఎదురుగా ఉన్న స్థలాన్ని మంగళవారం కలెక్టర్ షన్మోహన్ పరిశీలించారు. ఎంకపురం చెరువు సమీపంలోని హంద్రీనీవా కాలువను, పక్కనే ఉన్న చెరువునూ చూశారు. సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో సభ కోసం ఈ స్థలాలను పరిశీలించినట్లు సమాచారం. సీఎం పర్యటన ఈనెల 16లేదా 25వ తేదిపైన ఉంటుందని అధికార పార్టీ నాయకులు తెలిపారు. కలెక్టర్ పర్యటన ఫొటోలు తీసేందుకు విలేకరులు ప్రయత్నించగా.. వద్దని కలెక్టర్ నిరాకరించారు. ఎమ్మెల్సీ భరత్, తహసీల్దారు మురళీకృష్ణ, అధికారులు, వైసీపీ నేతలు, ఇతర ప్రజా ప్రతినిధులు కలెక్టరుతో పాటు ఉన్నారు. కాగా, ఈ నెల 5వ తేది సీఎం జగన్ రామకుప్పం పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే.

కర్ణాటక మద్యంతోపాటు బైకు పట్టివేత

బాలుడితో పాటు మరొకరి అరెస్టు

పలమనేరు, ఫిబ్రవరి 13: పలమనేరు రఘువీరారెడ్డి కాలనీలో విక్రయాలకోసం కర్ణాటక మద్యం మోటరుసైకిల్ పై తీసుకొచ్చిన సుందరేష్‌ను, మరో బాలుడిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. వీరి నుంచి మోటరు సైకిల్‌ను, రూ.50వేల విలువ చేసే 576 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్పీ



నగరి, ఫిబ్రవరి 13: నగరి మండలం.. తమిళనాడు సరిహద్దున ఉన్న చెక్‌పోస్టును మంగళవారం ఎస్పీ జాషువా తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టులను తనిఖీ చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా కొత్తగా వచ్చిన ఎస్పీ జాషువా తడుకుపేట వద్ద గల ఈ చెక్‌పోస్టును తనిఖీ చేసి.. సిబ్బందికి సూచనలిచ్చారు. సీఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటికి రికార్డుస్థాయి ఆదాయం


దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 : శ్రీకాళహస్తీశ్వరాలయానికి రికార్డు స్థాయి ఆదాయం లభించింది. ఆలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో జరిగిన లెక్కింపులో 1,85,80,188 రూపాయలు హుండీ ద్వారా వచ్చింది. బంగారం 118 గ్రాములు, వెండి 572.350 కేజీలు రాగా వివిధ దేశాలకు చెందిన 153 నోట్లు లభించాయి. 34 రోజుల తర్వాత జరిగిన లెక్కింపులో వచ్చిన ఈ ఆదాయం సరికొత్త రికార్డుగా అధికారులు ప్రకటించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.48 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం భారీగా లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. రూ.5.48 కోట్లు లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 69,314 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,165 మంది తలనీలాలు సమర్పించారు.

పద్మావతి వర్సిటీ వీసీ నేపాల్‌కు పయనం


ప్రొఫెసర్ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 : పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి నేపాల్‌కు పయనమయ్యారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ ఖాట్మండ్‌లో నిర్వహించనున్న ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఆమె పాల్గొంటారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు, బోధన, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, విదేశీ విద్యార్థులు పద్మావతి వర్సిటీలో చదువుకోవడానికి అవకాశాలు కల్పించడం కోసం ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్టు చెప్పారు. తిరుపతి నుంచి మంగళవారం ఆమె పయనమయ్యారు.

రెండో రోజూ వైభవంగా..!

పేటమిట్టలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న గల్లా కుటుంబీకులు

పూతలపట్టు, ఫిబ్రవరి 13: పూతలపట్టు మండలం పేటమిట్టలో రెండో రోజైన మంగళవారం కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు వేద స్వస్తి గోపూజ, యంత్రార్చన, ప్రధానకుంభ వాహనాలు, గణపతి అష్ట ద్రవ్య హవనం, ప్రతిష్ఠించబోయే సమస్త దేవతల విగ్రహాలకు పంచగవ్యం, క్షీరం, నదీసదా సముద్ర జలాలతో గల్లా జయదేవ్, గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి చేతుల మీదుగా పూజాభిషేకాలు జరిగాయి. సాయంత్రం మూషిక వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, గంట, రథం, శిలా గజాలకు దాతలచే పూజలు నిర్వహించారు. 5 గంటల నుంచి యాగశాల మండపం అర్చకులు వివిధ దేవతలకు హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. అమరరాజా విద్యాసంస్థల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, సర్పంచి గల్లా రాధాకృష్ణ, ట్రస్టు సెక్రటరీ గల్లా రాజశేఖర్, ట్రెజరర్ గల్లా రామానాయుడు, సభ్యులు భానుమూర్తి నాయుడు, గల్లా సంపత్ నాయుడు, గల్లా దామోదర ప్రసాద్, బాబ్జీ, చౌదరి, ట్రస్టు సభ్యులు, పేటమిట్ట పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారులూ.. ఇదేమి తీరు!

ఆర్టీసీ బస్టాండులో ఆసరా కార్యక్రమం - ముందురోజే ఏర్పాట్లతో రోడ్డుపైనే ఆగిన బస్సులు

పలమనేరులో ప్రయాణికులకు అగచాట్లు



ఆర్టీసీ బస్టాండులో మంగళవారం మధ్యాహ్నం నుంచే షామియానా వేస్తున్న కూలీలు - జాతీయరహదారిపై నిలిచిన బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

పలమనేరు, ఫిబ్రవరి 13: ఆర్టీసీ బస్టాండులో 'ఆసరా' సభ పెట్టాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆదేశించారు. అధికారులు పాటించారు. బుధవారం నాటి సభకు.. మంగళవారం మధ్యాహ్నం నుంచే ఏర్పాట్లు చేపట్టారు. వీరి నిర్వాకంతో పలమనేరులోని బస్టాండుకు బస్సులు రాక.. ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. ఆసరా పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు విడతల వారీగా చెక్కులు పంపిణీ చేస్తుంటారు. ఎన్నికల వేళ అధికార పార్టీ మరింత ప్రచారం కోసం ఈ చెక్కుల పంపిణీకి ప్రభుత్వ ఖర్చుతో సభను ఏర్పాటు చేస్తోంది. పలమనేరు మున్సిపాలిటీలోని 785 సంఘాలకు ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా బుధవారం చెక్కుల పంపిణీకి కార్యక్రమాన్ని రూపొందించారు. పట్టణంలో పలు కల్యాణ మండపాలు, ఆటస్థలాలున్నా.. దీనికి వేదికగా పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండును ఎంచుకున్నారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే బస్టాండులో అధికారులు షామియానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆర్టీసీ బస్టాండుకు రావాల్సిన బస్సులను జాతీయ రహదారిపైనే నిలిపి వేశారు. వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సులకోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులను ఎక్కేందుకు.. దిగిన వారూ.. జాతీయ రహదారి దాటాల్సి రావడంతో ఇబ్బంది పడ్డారు.

దుకాణదారుల ఆవేదన

ఇక, ఆర్టీసీ బస్టాండులోని దుకాణదారులూ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా బస్టాండులో అత్యధిక అద్దెలు చెల్లిస్తూ గదులు, ఖాళీస్థలాలు తీసుకొని చిరువ్యాపారాలు చేసుకొంటున్నారు. సగటున వీరు ప్రతిరోజు రూ.500నుంచి రూ.700 వరకు అద్దె చెల్లిస్తుంటారు. రెండురోజుల పాటు వ్యాపారాలు చేసుకునే వీల్లేకుండా.. బస్సులు బస్టాండులోకిరాకుండా చేయడంతో అద్దె చెల్లింపులకు ఇబ్బంది పడాల్సి వస్తోందని అంటున్నారు. అధికార పార్టీ నాయకుల మన్నన కోసం అధికారులు చూపే ఈ అత్యుత్సాహం ప్రయాణికులు, చిరువ్యాపారులకు ఇబ్బందిగా మారింది.

వీడని ఏనుగులు



విరిచేసిన అరటి పంట - ఏనుగులు ధ్వంసం చేసిన చెరకు క్రషర్

సదుం, ఫిబ్రవరి 13: సదుం మండలం అటవీ శివారు ప్రాంతాల్లో తరచూ ఏనుగుల గుంపు తిరుగుతున్నాయి. పంట పొలాలను ధ్వంసం చేస్తుండడంతో రైతుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. జోగివారిపల్లె పంచాయతీ మార్తువారిపల్లె సమీపంలో సోమవారం రాత్రి రైతు లోకనాథంకు చెందిన చెరకు, బెల్లం గానుగ సామగ్రి, క్రషర్, పక్కనే ఉన్న అరటి తోటను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ ఏనుగుల సంచారం, పంట పొలాల ధ్వంసంతోపాటు ఇటీవల ఏనుగుల దాడిలో ఒకరిద్దరు గాయపడి, మృతి చెందడం స్థానికులను కలవరపాటుకు గురిచేస్తోంది.



ఏనుగుల దాడిలో మామిడి చెట్లు ధ్వంసం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 13: బంగారుపాళ్యం మండలం కొదల మడుగు అటవీసమీపంలోని ఏనుగుల గుంపు సోమవారం రాత్రి మామిడి తోటలపై దాడిచేసి, పూతకు వచ్చిన కొమ్మలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన మాసలామణికి చెందిన సుమారు 30 మామిడిచెట్లను, పూతకొచ్చిన మామిడికొమ్మలను ధ్వంసంచేశాయి.

రథసప్తమికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

నూతన ఎస్పీ మలికా గర్గ్


రథసప్తమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యజయంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీన తిరుమలలో రథసప్తమికి కట్టుదిట్టమైన భద్ర ఏర్పాట్లు చేస్తామని నూతన ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆమె మంగళవారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్, స్థానిక పోలీసు అధికారులతో కలిసి మాడవీధులు, గ్యాలరీలు, భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను పరిశీలించారు. అవుటర్ రింగ్ రోడ్డు, కమాండ్ కంట్రోల్ రూంను చూశారు. రథసప్తమికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్య, వాహన సేవల నిర్వహణ, ఏటా ఎదురయ్యే సమస్యల గురించి సీవీఎస్వో ఎస్పీకి వివరించారు. మలికా గర్గ్ మీడియాతో మాట్లాడుతూ రథసప్తమి రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం టీటీడీ ఈవో ధర్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

దొంగ ఓట్ల నుంచి తిరుపతిని కాపాడు తల్లీ!

● గంగమ్మ గుడిలో టీడీపీ నాయకుల వేడుకోలు



తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి మాయనిమచ్చగా నిలిచిన దొంగ ఓట్లు నుంచి కాపాడాలని టీడీపీ నేతలు కోరారు. జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తిరుపతిలో దొంగ ఓట్లపై నిరసనగా మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో టీడీపీ శ్రేణులు వేయికళ్ల దుత్తలతో వేడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికలు మొదలుకుని లోక్‌సభ ఉప ఎన్నికలు, టౌన్ బ్యాంకు ఎన్నికల వరకు దొంగ ఓట్లుపైనే గెలిచారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లుతో గెలవాలని చూశారని, విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు స్వస్తి పలికేలా గంగమ్మ తల్లి కాపుకాయాలని కోరారు. సూత్రధారులను పోటీకి అనర్హులుగా ప్రకటించాలని డిమాండు చేశారు. అదేవిధంగా తిరుపతి గంగ జాతరను రాజకీయం చేశారని, కానుకలను ఖాళీ చేసి ఆలయాన్ని అప్రతిష్టపాలు చేశారని విమర్శించారు. రాబోయే జాతరకు కూడా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయలేరని, భక్తులకు ఇబ్బందులు తప్పవని అన్నారు.

గంగను వదిలి పంటలను కాపాడండి


తెలుగుగంగ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 13: తెలుగుగంగ నీరందించి ఎండుతున్న పంటలను కాపాడాలని సంబంధిత అధికారులకు మంగళవారం రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో చెరువులోని నీరు చివరి తడికమాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయని నీరు ఇవ్వకపోతే 1000 ఎకరాల్లో వేసిన వరి పంటలు ఎండిపోతాయని తెలిపారు. దీనిపై అధికారులు స్పందిస్తూ నీటి విషయంపై ఉన్నతదికారుల దృష్టికి తీసుకుపోతామని చెప్పారు.

నిరుద్యోగులపైనా బాదుడే

టెట్ రుసుం రూ.250 పెంపు

ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపు లేదు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ పోటీపరీక్షలకు దరఖాస్తు అంటేనే నిరుద్యోగులు భయపడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 336 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. వీటికి వేలాది మంది పోటీపడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ డీఎస్సీ రాసేందుకు అభ్యర్థులు టెట్‌లో అర్హత సాధించాలి. 2022లో వైసీపీ ప్రభుత్వం టెట్ నిర్వహించింది. అప్పట్లో పేపర్‌కు రూ.500 చొప్పున రుసుము వసూలు చేశారు. తాజాగా దీనిని రూ.250 పెంచి రూ.750గా ఖరారుచేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులకు ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. జనవరిలో కేంద్ర ప్రభుత్వం సీ-టెట్ నిర్వహించింది. ఒక్కో పేపర్‌కు రూ.500 రుసుం నిర్ణయించింది. రెండు పేపర్లు రాస్తే రూ.600 మాత్రమే వసూలు చేసింది. అదే మన రాష్ట్రంలో పేపరుకు రూ.750 చొప్పున ఎన్ని పేపర్లు రాయాలంటే అన్నిటికీ వేరువేరుగా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. డీఎడ్, బీఈడీ, ఎంఈడీ విద్యార్హత ఉన్నవారు టెట్ మూడు పేపర్లు రాస్తారు. అదే డీఎడ్, బీఈడీ అర్హతలు ఉంటే తప్పనిసరిగా రెండు పేపర్లు రాయాలి. 2018 తర్వాత డీఎస్సీ లేకపోవడంతో మూడు ఉపాధ్యాయ విద్యార్హతలు ఎక్కువ మందికి ఉన్నాయి. ఒక్క పేపరుకు రూ.750 చొప్పున మూడు పేపర్లకు రూ.2250, రెండు పేపర్లకు రూ.1500 చెల్లించాల్సివుంది. ఇక పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సుమారు రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు పుస్తకాల కొనుగోళ్లకే ఖర్చు చేయాలి. టీడీపీ హయాంలో శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సర్కిల్స్ ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక స్టడీ సర్కిల్స్ మాయమయ్యాయి. దాంతో అభ్యర్థులు సొంతంగా పరీక్షలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు అందివ్వండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13: చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, ఇతర పెన్షనర్లు 2023-24 సంవత్సరానికి సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెలాఖరులోగా అందజేయాలని చిత్తూరు సబ్‌ట్రెజరీ ఆఫీసర్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా సమీప ఉపఖజానా కార్యాలయాలకు నేరుగా వచ్చి వీటిని అందించాలన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఇబ్బందులు ఉంటే 9951602382కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చని సూచించారు. ఇప్పటికే సుమారు 70శాతం మంది పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వని వారికి మార్చి ఒకటి నుంచి పెన్షన్ ఆగే పరిస్థితి ఉందన్నారు.

వైసీపీ ర్యాలీలో ఉపాధి ఉద్యోగి చిందులు


వైసీపీ ర్యాలీలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మదివానందం (చారల చొక్కా వ్యక్తి)

చిత్తూరు, ఫిబ్రవరి 13: అతడు పని చేసేది పెనుమూరు మండలంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా. సొంతూరేమో పాలసముద్రం మండలంలోని ఆముదాల పంచాయతీ. ఇక్కడ ఈయన భార్య అనురేఖ అధికారపార్టీకి చెందిన సర్పంచి. ఈ క్రమంలో పక్క మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసే మదివానందం.. సొంత పంచాయతీలో వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మంగళవారం వైసీపీ నాయకులు 'సిద్ధం' పేరుతో బలిజకండ్రిగ నుంచి రంగాపురం మీదుగా నరసింహాపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు ఉత్సాహంతో చిందులు వేశారు. ఈ చిందుల్లో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ మదివానందం చిందులేయడం విమర్శలకు తావిచ్చింది. టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉంటూ విధులకు హాజరుకాకపోయినా పెనుమూరు మండల అధికారులు ఎలా ఉపేక్షిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇతడు చిందులేసిన వీడియో సోషల్ మీడియాలో మంగళవారం హల్‌చల్ చేసింది.

ట్రాక్టర్ బోల్తా.. వ్యవసాయ కూలీ దుర్మరణం


మృతుడు రామదాసు

బి కొత్తకోట,ఫిబ్రవరి13: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ వ్యవసాయ కూలీ దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం బి కొత్తకోట మండలంలో జరిగింది. మండలంలోని బుచ్చిరెడ్డిగారి పల్లెకు చెందిన వ్యవసాయకూలీ కోడికూతల దాసరి రామదాసు(42) వ్యవసాయ పనులతో పాటు,ట్రాక్టర్ డ్రైవర్‌గా కూడా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే వాడు. యథాప్రకారం మంగళవారం తన స్వగ్రామం నుంచి సూరపువారిపల్లెకు బయలుదేరి డేగానిపల్లె డంపింగ్‌యార్డ్ వద్దకు రాగానే పక్కనున్న కల్వర్టును ఢీకొని గుంతలో పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడు రామదాసుకు సంతానం లేదు. భార్య సుబ్బలక్ష్మి ఉన్నారు. సమాచారం అందుకున్న బి.కొత్తకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి


బాలుడు సాత్విక్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 13: మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో మూడేళ్ల చిన్నారి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. చిప్పిలి గ్రామానికి చెందిన మౌనిక, నాగరాజులకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి వరుణ్ తేజ్(5), సాత్విక్(3) కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం మౌనిక, నాగరాజు కుటుంబం మనస్పర్థల కారణంగా విడిపోయారు. అనంతరం మౌనిక శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తితో సాన్నిహిత్యం పెంచుకుంది. మంగళవారం బెంగ ళూరు రోడ్డులోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్న మౌనిక విధులకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె చిన్నకొడుకు సాత్విక్ ఇంట్లోనే మృతి చెంది ఉన్నట్లు మౌనికకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న ఆమె కుమారుడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యులు చెప్పారు. కాగా బాలుడు నీటి సంపులో పడి మృతి చెందాడని కొందరు అంటుండగా, బాలుడి ముఖం, శరీరంపై గాయాలు వున్నాయని ఇది అనుమానాస్పద మృతిగా వుందని మరికొందరు చెబుతున్నారు. దీనిపై తాలూకా సీఐ శేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ రవికుమార్‌లు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని విచారిస్తున్నారు.

ప్రమాదవ శాత్తు బావిలో పడి మహిళ మృతి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 13 : ప్రమాదవ శాత్తు ఓ మహిళ బావిలో పడి మృతి చెందిన సంఘటన పులికల్లు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులికల్లు గ్రామం చిన్నవెంకట్రామగారిపల్లె (సివిపల్లె)కు చెందిన తిరుమలశెట్టి లక్ష్మన్న భార్య తిరుమల శెట్టి లక్ష్మిదేవి(55) భర్త లక్షుమన్న 10 సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఈమెకు కుమారుడు ఉన్నాడు అతను మదనపల్లెలో కాపురముండగా ఈమె ఒంటరిగా ఉంటోంది కాగా ఈమెకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఎప్పుడూ ఎక్కడో ఒక చోట తిరుగుతుంటుందన్నారు. అందులో బాగంగానే గత మూడు రోజులుగా కనపడకుండా పోయిందన్నారు. అయితే మంగళవారం కమ్మవారిపల్లె సమీపంలోని చిన్నయ్యగారి బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికి తీసి లక్ష్మిదేవి మృతదేహంగా గుర్తించి దహనక్రియలను చేశారు. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు.

'మహాశక్తి'తో మహిళలు మహారాణులు

● టీడీపీ అధికారంలోకి రాగానే నెలకు రూ.4 వేల పింఛన్ ● వైసీపీ దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి ● నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


వేపులబైలులో ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 13: తమ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన 'మహాశక్తి' పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలందరూ మహారాణులుగా మారడం ఖాయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు మండలం వేపులబైలు పంచాయతీలో మంగళవారం ఆయన టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముటుకుపల్లెలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మహాశక్తి పథకంలో భాగంగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 'ఆడబిడ్డ నిధి' నుంచి 18 ఏళ్లు దాటిన మహిళలందరికీ నెలకు రూ.1500లు, 'తల్లికి వందనం' పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికీ ఏడాదికి రూ.15 వేలు, 'దీపం' పేరుతో ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తారని తెలిపారు. అంతే కాకుండా ఆయన మానసపుత్రికలైన అయిన డ్వాక్రా సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రూ.200లు ఉన్న సామాజిక భద్రతా పింఛన్లను 2014లో ముఖ్యమంత్రి అయిన వెంటనే చంద్రబాబు నాయుడు ఒక్కసారిగా రూ.2 వేలు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితే పింఛన్‌ను రూ.4 వేలు చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించారు. అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు పీలేరుతోపాటు దాని పరిసర ప్రాంతాల్లోని సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని, మరోమారు వారు అధికారంలోకి వస్తే సామన్య ప్రజలకు చెందిన పట్టా భూములు, ఆస్తులను కూడా కబ్జా చేస్తారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అయిన తనను ఆదరించాలని, వైసీపీ కారణంగా పీలేరు నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధిని మళ్లీ పరుగులు పెట్టిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వైసీపీ అహంకారానికి టీడీపీకి ఓటు వేయడం ద్వారా చరమగీతం పాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేపులబైలు పంచాయతీలోని కంచంవారిపల్లె, నగరి, చెరుకువారిపల్లె, మిట్టపల్లె, కురవపల్లె, వరంపాటివారిపల్లెల్లో ఆయన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బెజవాడ దినేశ్, టీడీపీ నాయకులు వసంతల రాజా, బత్తిన సిద్దయ్య నాయుడు, నాగమ్మ, ప్రభాకర్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, నరసింహులు నాయుడు, రవీంద్ర నాయుడు, ఆనంద నాయుడు, గాయం వెంకటరెడ్డి, ఏటీ వెంకట్రామిరెడ్డి, యుగంధర్, చంద్రమోహన్, జయచంద్ర, మునాఫ్, హనీఫ్, ఫైరోజ్, పురుషోత్తం రెడ్డి, గాండ్ల విజయ్ కుమార్, జనసేన నాయకలు కలప రవి, గజేంద్ర, షఫీ, మోహనకృష్ణ, నవీన్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

రాఘవకు ఇడుపులపాయలో స్థలమివ్వండి

● రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్


రాస్తారోకో చేస్తున్న శంకర్‌యాదవ్ టీడీపీ -జనసేన నాయకులు

బి.కొత్తకోట,ఫిబ్రవరి 13: యాత్ర2 డైరెక్టర్ మహీ రాఘవపై ప్రేమ ఉంటే సీఎం జగన్‌రెడ్డి తమ ఇడుపులపాయలో ఆయనకు స్థలం కేటాయించాలని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ సలహా ఇచ్చారు. హార్స్‌లీ హిల్స్‌లో ఇంతకు మునుపు క్రీడాశిక్షణా కేంద్రం కోసం కేటాయించిన భూమిలో 2ఎకరాలను యాత్ర సినిమా డైరెక్టర్ కు ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం బి.కొత్తకోట జ్యోతి బస్టాండులో శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. హార్స్‌లీ హిల్స్‌లో భూ వితరణ చేయాలన్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, జనసేన నేత సాయినాథ్ కిరణ్ రాయల్, టీడీపీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, శ్రీనివాసులు, సమీవుల్లా, కుమార్, మొటుకు శివ, ప్రసాద్, సుకుమార్, రాజా,పద్మనాభం,కుడుం రంజిత్, శరత్,సురేంద్ర,మార్కెట్‌యార్డ్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హోంగార్డు మృతి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 13: మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ ఎస్సీ కాలనికి చెందిన రిటైర్డు హోంగార్డు కృష్ణయ్య(62) మంగళవారం ద్విచక్రవాహనంలో మదనపల్లె వస్తుండగా వై జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న టెంపో ఢీ కొంది. ఈ ప్రమా దంలో కృష్ణయ్య తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని టెంపో వాహనాన్ని స్వాధీనం చేసుకుని కృష్ణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం - నిందితుడు అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 13: మండలంలోని కాలువపల్లెలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న రెడ్డెప్పను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గ్రామంలో దాడులు నిర్వహించి అతని వద్ద నుంచి 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్పవృక్ష.. హనుమద్ వాహనంపై సర్వాంతర్యామి



కల్పవృక్ష వాహనంపై హనుమద్ వాహనంపై అభయమిస్తున్న సర్వాంతర్యామి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 13: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటరమణ స్వామి వారు మంగళవారం ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి హనుమద్ వాహనంపై భక్తులను కటాక్షించారు. వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో బాగంగా టీటీడీ వేద పండితులు మంగళవారం వేకువనే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాల సేవ, అర్చన, ప్రత్యేక పూజల. అనంతరం కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు భక్తుల గోవిందనామస్మరణలు, భజనల నడుమ ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. . రాత్రి దేవదేవుడు హనుమద్ వాహనం అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. స్వామి వారి వాహన సేవలను వీక్షించేం దుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారు దర్శనం ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్, ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసా ద్ భట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సోమనాథేశ్వర స్వామి దర్శనం

ములకలచెరువు, ఫిబ్రవరి 13: మండలంలోని పాత ములకలచెరువు, కదిరినాథునికోట గ్రామాల్లో మంగళవారం వైభవంగా సోమనాథేశ్వర స్వామి వజ్రలింగ దర్శనం కల్పించారు. దివ్య స్వర్ణిమ రథయాత్రకు గ్రామాల్లో భక్తులు మంగళవాయిద్యాల నడుమ స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు స్వామి వారి వజ్రలింగ దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాల్లో బ్రహ్మకుమారిలు యశోద, శాంతమ్మ, శిల్ప పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు


పెద్దమండ్యంలో విద్యార్థిని నాగేశ్వరిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం


కురబలకోటలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు అజార్, నాగలక్ష్మి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 13: ఇన్‌స్పైర్ మనక్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఆయా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు. ఇందులో తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ఓ విద్యార్థి ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రం రాయచోటి డైట్ కళాశాలలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలలో కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో చదువుతున్న వై.కార్తీక రూపొందించిన ప్రొటెక్షన్ ఆఫ్ నర్సరీ స్లాపింగ్స్(నర్సరీలో మొక్కలను సంరక్షించే పద్ధతి) నమూనా, ఇదే పాఠశాలలో చదువుతున్న ఏ.సుమంత్ రూపొందించిన ఫ్రెస్నెల్‌లెన్స్ వాటర్ హీటర్ నమూనాలు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపికయ్యాయి. అదేవిధంగా మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు రాజశేఖర్ నాయక్, కళ్యాణ్ సంయుక్తంగా గైడ్ టీచర్లు అజహర్, నాగలక్ష్మీ, వెంకటరమణ మార్గదర్శకంలో రూపొందించిన బైస్కిల్ అగ్రికల్చర్ స్ప్రేయర్ ప్రాజెక్ట్ మొదటి స్థానంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. వీరు ఏప్రిల్‌లో చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలలో పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు, త్యాగరాజు నాగసుబ్బరాయుడు, హెచ్ఎంలు మదన్మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

కలికిరిలో: కలికిరి పట్టణానికి చెందిన విద్యార్థి ఇన్‌స్పైర్‌మనక్‌లో ప్రదర్శించిన నమూనా రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఇందిరమ్మ కాలనీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ షారూక్ 'హ్యాండ్ బేస్డ్ అప్రోచ్ ఫర్ డిసేబుల్' అంశంపై తయారు చేసిన నమూనాను జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌మనక్‌లో ప్రదర్శించాడు. ఈ నమూనా జిల్లా స్థాయిలో ఆకట్టుకోవడంతో మంగళవారం షారూక్‌ను, అతనికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయినులు ఎం.ఉషారాణి, ఈవీ అరుంధతిలను పలువురు అభినందించారు. అంతేగాకుండా హెచ్ఎం సంపత్‌కుమార్, ఇతర పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కాగా కలికిరి సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి నేహత్ కృష్ణ ప్రదర్శన కూడా రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యింది.

కురబలకోటలో: మండలంలోని అంగళ్ళు సమీపంలోని చేనేత నగర్ వద్దనున్న మహాత్మజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థుల ప్రదర్శన రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామాంజనేయరెడ్డి తెలిపారు. రాయచోటి డైట్ స్కూల్‌లో జరిగిన జిల్లా ప్రదర్శనలో పాఠశాలలో 9వతరగతికి చెందిన రాజశేఖర్ నాయక్, యశ్వంత్‌లు వ్యవసాయ రంగంలో పంట పొలాల్లో పిచికారి చేసే బ్యాటరీతో పని చేసే సైకిల్ యంత్రాన్ని పోటీలలో ప్రదర్శించారు. కాగా ఈ పోటీలలో 21ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయగా విద్యార్థుల ప్రాజెక్టుకు ప్రథమస్థానం దక్కింది. కాగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మెమెంటోలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అజార్, నాగలక్ష్మి అభినందించారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలం సిద్దవరం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని టి.నాగేశ్వరి ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాణికుమారి వెల్లడించారు, రాయచోటి లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల ప్రదర్శనలో మండలంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.నాగేశ్వరి ఇన్‌స్పైర్‌గా స్టూడెంట్స్ అటెనెన్స్ నోటిఫికేషన్ టూ పేరెంట్స్ ప్రదర్శించగా రాష్ట్ర స్థాయిలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. గత నెల జనవరిలో పెద్దమండ్యంలో జరిగిన మండల స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన లో ఆ విద్యార్థిని ఇన్‌స్పైర్ మొదటిస్థానం లో నిలిచి, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. ఇంటి నుంచి పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఆయా పాఠశాలకు, తరగతి గదిలో హాజరు వేసినట్లు వెంటనే పాఠశాల ద్వారా తల్లిదండ్రులకు సమాచారం చేరుతుందన్నారు. పాఠశాల మైక్రోసాఫ్ట్ ద్వారా ఇంటిలోని సెల్‌ఫోన్ కు బ్లూటూత్ కు సమాచారం చేరుతుందని తెలిపారు. ఇది విద్యాసంస్థలకే కాకుండా సాఫ్ట్‌వేర్ సంస్థలు, బ్యాంకుల్లో, పెద్ద పెద్ద దుకాణదారులు కూడా వినియోగం లోకి తెచ్చుకోవచ్చునని విద్యార్థిని వివరించారు. పెద్దమండ్యం ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ, సర్పంచ్ విజయకుమారి, ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, ప్రిన్సిపాల్ రాణికుమారి, గైడ్ కుమారీ, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని నాగేశ్వరిని అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అగ్రహారంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 13: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లోకేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అగ్రహారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇతర వ్యక్తులు ఫోన్ చేసి మీకు లోన్ ఇస్తామని మాయమాటలు చెప్పి బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తాన్ని దోచేస్తారని తెలిపారు. ఇప్పటికే ఇలాంటి కేసులు వచ్చాయని వాటిని విచారించగా అవి ఇతర రాష్ట్రాలకు చెందినవిగా గుర్తించామన్నారు. నాటుసారా గంజాయి, పేకాట, జూదం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు తెలిపారు.

యాత్ర -2 డైరెక్టర్‌కు భూ కేటాయింపును రద్దుచేయండి

● జేసీకి టీడీపీ, సీపీఐ, జై భీమ్ భారత్‌పార్టీ నాయకుల వినతి


జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్/కురబలకోట, ఫిబ్రవరి 13: హార్సిలీహిల్స్‌లో యాత్ర-2 డైరెక్టర్ మహీ రాఘవన్‌కు మినీ స్టుడియోకు స్థల కేటాయింపు ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని టీడీపీ, సీపీఐ, జైభీమ్ భారత్ పార్టీ నేతలు జేసీ ఫర్హాన్ అహ్మద్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాయచోటిలోని జేసీ కార్యాలయంలో జేసీని కలిసి వారొక వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్‌అధ్యక్షుడు సురేంద్రయాదవ్, జై భీమ్‌భారత్‌పార్టీ నాయకుడు కోనభాస్కర్,. సీపీఐ నాయకుడు మురళి మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌లో ఇప్పటికే ఆ భూమిని క్రీడా శిక్షణ కోసం కేటాయించారని అలాంటి ప్రభుత్వ విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూడడం సరికాదన్నారు. సీఎం జగన్ వ్యక్తిగత ప్రచారం కోసం ప్రభుత్వభూములను పంచిపెడితే ఊరుకోమని ఖచ్చితంగాప్రతిఘటిస్తామన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు హార్సిలీహిల్స్ వెళ్లి అధికారిక ఉత్తర్వులు లేకుండా భూమిని ఏవిధంగా పరిశీలిస్తారని వారు ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసి అడుగగా మాకు ఎలాంటి అధికారికంగా ఉత్తర్వులు లేవని, ఆభూమి కేవలం క్రీడా శిక్షణ కోసం కేటాయించారని, అది సినీ డైరెక్టర్‌కు ఎందుకు కేటాయిస్తామని, అవి అంతా అపోహలు మాత్రమే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకపోతే అఖిపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి స్థలాన్ని కాపాడుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాపతి నేషనల్ ఫైటర్ నాయకులు రాజారెడ్డి, వెంకటేష్, సదాశివ, కోనభాస్కర్, మురళి, శంకర్‌రెడ్డి, ఆలం పాల్గొన్నారు.

రెండునెలలు కష్టపడితే అధికారం మనదే..

● జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు


ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేత రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 13: ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ రెండునెలలు కష్టపడి పనిచేస్తే అధికారం మనదేనని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు జనసైనికులకు సూచించారు. స్థానిక బర్మావీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇంత కాలం కష్టపడిన దానికంటే, ఈ రెండునెలలు పనిచేయడం ముఖ్యమనే అంశాన్ని గుర్తించాలన్నారు. మంగళవారం 58వరోజు ఎస్‌బీఐకాలనీ, గొల్లపల్లెరోడ్డులలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇందులోభాగంగా జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే, తాము చేపట్టబోయే అభివృద్ధి, అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జనసేన ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, కొణిదెల శంకర్ బాబు, కోటకొండ చంద్రశేఖర్, ఆకుల శంకర్, అశ్వత్‌రాయల్, ధరణికుమార్, సోను, సుప్రీంహర్ష, యాసీన్, నవాజ్, బహదూర్, చంద్రశేఖర్, పద్మావతి, శేఖర్ పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడేవారికి పదవులు దక్కుతాయి

● రాజంపేట పార్లమెంట్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్


నూతన అధ్యక్షుడు రవికుమార్‌ను సన్మానిస్తున్న యల్లంపల్లెప్రశాంత్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13: భారతీయ జనతా పార్టీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపుతోపాటు పదవులు వెతుకుంటూవస్తాయని బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లెప్రశాంత్, ఆకులకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ కాల నీలోని బీజేపీ కార్యాలయంలో మదనపల్లె పట్టణ అధ్యక్షుడుగా రెండవసారి ఎంపికైన బర్నేపల్లె రవికుమార్‌ను బీజేపీ నాయకులు పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో మదనపల్లె నియోజకవర్గంలోజెండా ఎగరవేయాలని, ఈ దిశగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్లాలన్నారు. దేశంలో మూడోసారీ మోదీని ప్రధానిమంత్రిగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. నాపై నమ్మకంతో పట్టణ అధ్యక్షుడి పదవి ఇవ్వడానికి సహకరించిన రాష్ట్రఅధ్యక్షు రాలు పురందేశ్వరికి, జిల్లాఅధ్యక్షుడు సాయిలోకేష్‌కు, జిల్లాప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

గ్రామ పంచాయతీ నిధుల ఖర్చుపై డీపీవో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో ధనలక్ష్మి

రామసముద్రం, ఫిబ్రవరి 13: మండలంలోని గ్రామ పంచాయతీలలో 15వ ఫైనాన్స్‌కు సంబంధించిన ఖర్చులపై జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి మంగళవారం పంచా యతీ కార్యదర్శులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి మంజూ రైన 15వ ఫైనాన్స్ నిధులు వీధి లైట్లు, విద్యుత్ ఛార్జీలు, క్లాప్‌మిత్ర జీతాలు తదితర ఖర్చులు చేసి నిధులు పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. సర్పంచ్‌ల ద్వారా ఈ నిధులు ఖర్చు చేయించా లని ఆమె సూచించారు. నిధుల ఖర్చుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాబోయే మార్చి నిధులపై దీని ప్రభావం ఉంటుందని ఆమె అన్నారు. అదేవిధంగా ఇంటి పన్నులు ఈనెలాఖరుకు 90శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడుకి ఘన సన్మానం


లీగల్ సెల్ అధ్యక్షుడు వెంకటరమణరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ పార్టీలో నూతనంగా నియమితులైన జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు తొట్ల వెంకటరమణారెడ్డిని మంగళవారం ఆయన స్వగృహంలో మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ సేవాతత్పరుడు, ఉన్నత విద్యావంతులడు తొట్ల వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో తరలివెళ్లి వెంకటరమణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతంచేయడానికి ఆయనతో కలిసినడుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రరెడ్డి, చల్లానాని, ఈశ్వరమ్మ, మహమూబ్‌పీర్, సమీర్, రవీంద్ర, బయ్యారెడ్డి, అమీర్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు బాలికలకు అనర్థదాయకం

పీలేరు, ఫిబ్రవరి 13: సరైన వివాహ వయస్సు రాకమునుపే జరిపించే బాల్య వివాహాలు బాలికలకు అనర్థదాయకమని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ రెడ్డి తెలిపారు. తన సిబ్బందితో కలిసి ఆయన మంగళవారం ఆయన బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వ హించారు. ప్రధానంగా వలస కూలీలు, ఇటుక బట్టీల కార్మిక కుటుంబాలకు చెందిన కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల చదువుకునే అవకాశం కోల్పోతారని, చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం వల్ల శారీరక, మానసిక ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. అనంతరం వారికి రక్తహీనత నివారణ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమ, ఏఎన్ఎంలు రేణుక, భార్గవి, సీహెచ్‌వో రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ కోసమే భద్రత మాసోత్సవాలు


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీపీటీవోరాము తదితరులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీపీటీవోరాము పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో 150మంది విద్యార్థులకు రోడ్డుభద్రతా నియమాల ప్రాముఖ్యత తెలియజేస్తూ చిత్రలేఖన ప్రదర్శన నిర్వహించారు. ఇందులోప్రతిభ కనపర్చిన విద్యార్థులకు డీపీటీవో రాము చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో మదనపల్లె వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి, అసిస్టెంట్ మేనేజరు రేవతి, పాఠశాల కరస్పాండెంట్ ప్రసాదరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.